# India-Australia-Japan-United States Senior Officials Consultations

December 18, 2020

---

## భారత్-ఆస్ట్రేలియా-జపాన్-అమెరికా సీనియర్ అధికారుల సంప్రదింపులు

డిసెంబర్ 18, 2020

భారత్ విదేశీ వ్యవహారాల శాఖ, ఆస్ట్రేలియా విదేశీ వ్యవహారాలు మరియు వాణిజ్య శాఖ, జపాన్ విదేశీ వ్యవహారాల శాఖ మరియు అమెరికా విదేశాంగ శాఖ సీనియర్ అధికారులు 2020 డిసెంబర్ 18న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు.

2020 సెప్టెంబర్‌లో జరిగిన ఉన్నత స్థాయి చర్చలు, అలాగే టోక్యోలో 2020 అక్టోబర్ 6న నిర్వహించిన మంత్రుల సమావేశానికి కొనసాగింపుగా ఈ సమాలోచనలను నిర్వహించారు. పరస్పరం ప్రయోజనం కలిగిన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాల గురించి అధికారులు అభిప్రాయాలు పంచుకున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వం మరియు అభివృద్ధికి తోడ్పడేలా కనెక్టివిటీ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి, కౌంటర్-టెర్రరిజం, సైబర్ సెక్యూరిటీ, తీరప్రాంత గస్తీ, మానవతా సహాయ చర్యలు మరియు విపత్తు నిర్వహణ చర్యలు సహా భద్రతా సమస్యలు మొదలైన వాటికి సంబంధించి ప్రస్తుతం కొనసాగుతున్న మరియు ప్రతిపాదిత అంశాల్లో పరస్పర సహకారాన్ని పునఃసమీక్షించారు.

అంతర్జాతీయంగా ప్రస్తుతం కొనసాగుతున్న కోవిడ్-19 మహమ్మారి సంక్షోభానికి సంబంధించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిలకడగా, వేగవంతంగా కోలుకునేందుకు సరఫరా వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. కోవిడ్-19 టీకాలను సురక్షితంగా, సమర్థవంతంగా, అందుబాటులోకి తేవాల్సిన అవసరం కూడా ఉందని నొక్కిచెప్పారు.

ఉమ్మడి విలువలు, సిద్ధాంతాలు మరియు అంతర్జాతీయ చట్టాలను ముఖ్యంగా యూఎన్‌సీఎల్‌వోఎస్‌ను గౌరవిస్తూ స్వేచ్ఛ, సుసంపన్న మరియు సమ్మిళిత ప్రాంతంగా ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంటామని అధికారులు పునరుద్ఘాటించారు.

ఆసియాన్‌కు వియత్నాం సారథ్యం వహించడాన్ని అభినందించారు. ఈ ఏడాది నవంబర్‌లో నిర్వహించిన 15వ తూర్పు ఆసియా సదస్సు ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసియాన్ కేంద్రంగా, ఆసియాన్ సారథ్యంలోని యంత్రాంగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని తీర్చిదిద్దడంలో నేతల సారథ్యంలో జరిగిన తూర్పు ఆసియా సదస్సు వంటి వాటికి తోడ్పాటును ప్రకటించారు. అలాగే ఇండో-పసిఫిక్ అభ్యున్నతికి ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఆసియాన్‌తో పాటు మిగతా అన్ని దేశాలతో కలిసి పనిచేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

**న్యూఢిల్లీ**
**డిసెంబర్ 18, 2020**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.